సమస్యలపై సామాన్యుడి గళం

- 'సాక్షి ఫోన్ ఇన్' కార్యక్రమానికి విశేష స్పందన
- సమస్యల పరిష్కారానికి అధికారుల హామీ

ప్రజా సమస్యలను రికార్డు చేసుకుంటున్న ఉప్పల్ సర్కిల్ డీసీ ఆంజనేయులు



ఉప్పల్: ఉప్పల్ సర్కిల్ పరిధిలో నెలకొన్న స్థానిక సమస్యల పరిష్కారానికి సాక్షి ఆధ్వర్యంలో బుధవారం ఉప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులుతో నిర్వహించిన 'ఫోన్ ఇన్' కార్యక్రమానికి స్థానికుల నుంచి విశేష స్పందన వచ్చింది. బుధవారం ఉదయం 10.30 గంటల నుంచి 11.30 గంటల వరకు నిర్వహించిన ×ఫోన్ ఇన్¥ కార్యక్రమంలో పలు సమస్యలను స్థానికులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. చిన్న చిన్న సమస్యలను వెంటనే పరిష్కరిస్తానని, కోర్టు పరిధి, ఇతర విభాగాల పరిధిలోని పలు సమస్యలను ఆయా విభాగాల అధికారులకు సమాచారం ఇచ్చి త్వరలో పరిష్కరిస్తానని డీసీ ఆంజనేయులు హామీ ఇచ్చారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలకు డీసీ ఓపికగా సమాధానం ఇచ్చారు.

అద్దెకు డబ్బాలు..
రామంతాపూర్ వార్డు కార్యాలయం వద్ద రోడ్డుకు ఇరువైపుల డబ్బాలను ఏర్పాటు చేసి అద్దెకు ఇచ్చుకున్నారు. దీనివల్ల తీవ్రమైన ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది.
– నర్సింహ్మ, ఓల్డ్ రామంతాపూర్

దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటాం : డీసీ

టౌన్ ప్లానింగ్ సిబ్బందిని పంపించి దర్యాప్తు చేసిన తర్వాత తగిన చర్యలు తీసుకుంటాం. అవసరమైతే వెంటనే తొలగించేందుకు ఆదేశాలు జారీ చేస్తాం.

డంపింగ్ యార్డులా బృందావన్ గార్డెన్..

రామంతాపూర్ బృందావన్ గార్డెన్ వద్ద చెత్త నింపి డంపింగ్ యార్డులా మార్చారు. దీంతో స్థానికంగా దుర్వాసన వస్తుంది.
– రవీందర్, ఎక్స్ కో– ఆప్షన్ సభ్యులు

శానిటరీ జవాన్‌ను ఏర్పాటు చేస్తాం : డీసీ

చెత్త ఎవ్వరు వేస్తున్నారో అందుకు గల కారణాలు మొదటగా అన్వేషించి ఆ తరువాత చెత్త వేయకుండా శానిటరీ జవాన్‌ను ఏర్పాటు చేస్తాం. ఇంటింటికీ చెత్తను రిక్షా కార్మికులకు అందజేసేలా చర్యలు తీసుకుంటాం.

విద్యుత్ వైర్లపై చెట్ల కొమ్మలు..

ఉప్పల్ సరస్వతి కాలనీలో పురాతన భవనం వద్ద పెద్ద వృక్షం ఉంది. ఎప్పుడు కూలుతుందోనన్న భయం వెంటాడుతోంది. విద్యుత్ వైర్లపై చెట్టు కొమ్మలు వాలి ఉన్నాయి. అదే ప్రాంతంలో మ్యాన్ హోల్స్ ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ విషయాన్ని సంబంధిత అధికారులకు పలుసార్లు వివరించాం. ఎవ్వరూ పట్టించుకోవడం లేదు.
సుధాకర్‌రెడ్డి, ఉప్పల్ సరస్వతి కాలనీ అధ్యక్షుడు

చెట్ల కొమ్మలు తొలగించేందుకు చర్యలు : డీసీ

ఆర్బీకల్చర్ డిపార్టుమెంట్‌కు సమాచారం అందించి చెట్టుకొమ్మలు తొలగించడానికి తగిన చర్యలు తీసుకుంటాం. మ్యాన్‌హోల్ మూతను ఏర్పాటు చేయిస్తాం.

రోడ్లు తవ్వి వదిలేశారు..

ఉప్పల్ శ్రీనగర్‌కాలనీలో రోడ్లు తవ్వి వదిలేశారు. రాత్రిపూట వచ్చే వారు ప్రమాదాలకు గురవుతున్నారు. కళ్యాణపురి రోడ్డులో గత 15 రోజులుగా మురుగు నీరు పారుతున్నా పట్టించుకోవడం లేదు. చెట్ల కొమ్మలను తొలగించి రోడ్ల పైనే వేస్తున్నారు.
– కంచర్ల భరత్‌రెడ్డి, ఉప్పల్

జలమండలి అధికారులకు సమాచారం ఇస్తాం : డీసీ

రోడ్లపై మురుగు విషయమై జలమండలి జీఎంకు సమాచారం ఇస్తాను. చెట్ల కొమ్మలు తొలగించడానికి ఆర్బీకల్చర్ విభాగం అధికారులకు చెప్పి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటాం. రోడ్డు విషయంపై ఈఈ తో కలిసి పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం.

రోడ్లన్నీ జలమయం..

ఉప్పల్ బగాయత్ లే అవుట్‌లో వర్షం వచ్చిందంటే కాలనీల్లోని వరదంతా బగాయత్ రోడ్లపైకి వచ్చి రోడ్లన్నీ జలమయమవుతున్నాయి. సరైన అవుట్‌లెట్స్ లేకపోవడం వల్ల ఎక్కడి నీరు అక్కడే నిలిచిపోతుంది. ఉప్పల్ శాంతినగర్‌లోని మిక్చర్ కంపెనీల వల్ల వాతావరణం కలుషితమవుతోంది. పొగ కారణంగా స్థానికులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.
– ఆకుల మహేందర్, సమాజ సేవకులు

హెచ్‌ఎండీఏ నుంచి జీహెచ్‌ఎంసీ స్వాధీనం : డీసీ

ఉప్పల్ బగాయత్‌ను హెచ్‌ఎండీఏ నుంచి జీహెచ్‌ఎంసీ స్వాధీనం చేసుకుంది. అవుట్‌లెట్స్ కలపడానికి డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు జలమండలికి ఇప్పటికే దాదాపుగా రూ. 20 కోట్ల నిధులు కేటాయించారు. ఈ విషయాన్ని జోనల్ కమిషనర్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాం. ఈ విషయాన్ని వారి దృష్టికి తీసుకొస్తాను. మిక్చర్ కంపెనీ వల్ల స్థానికుల నుంచి అనేక ఫిర్యాదులు వస్తున్నాయి. పీసీబీకి లేఖ రాశాం. వారిచ్చే నివేదికల ఆధారంగా చర్యలు తీసుకుంటాం.

రామంతాపూర్ పెద్ద చెరువులో అక్రమ నిర్మాణాలు..

అక్రమ నిర్మాణాలపై కోర్టు నుంచి అదేశాలున్నా.. ఎఫ్‌టీఎల్ ఇంకా ఫిక్స్ చేయలేదు. చెరువులను పరిరక్షించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేసినా పట్టించుకోవడం లేదు. చెరువులు పూడిక తీత పనులు కూడా చేపట్టడం లేదు. ఈ విషయంపై ఆర్టీఐ చట్టం కింద సమాచారం అడిగినా స్పందించడం లేదు.
– బాపట్ల కృష్ణమోహన్, రామంతాపూర్

ఎఫ్‌టీఎల్ ఫిక్సింగ్ అంశం హెచ్‌ఎండీఏ పరిధిలో ఉంది : డీసీ

రామంతాపూర్ పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్ ఫిక్సింగ్ అంశం హెచ్‌ఎండీఏ పరిధిలో ఉంది. చెరువు ఫెన్సింగ్‌కు రూ. 90 లక్షల విడుదలయ్యాయి. అందులో 10 శాతం వరకు పనులు ప్రారంభించాం. కొని కారణాల వల్ల నిలిచిపోయినా.. త్వరలో ప్రారంభిస్తాం. చెరువు పూడికతీత కోసం రూ.కోటి 30 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఏజెన్సీని ఫైనల్ చేసి త్వరలో పనులు ప్రారంభిస్తాం.

చిన్నపాటి వర్షాలకే ఇళ్లలోకి వరద..

ఉప్పల్ అన్నపూర్ణనగర్‌లో చెట్టు ప్రమాదకరంగా మారింది. నాలాలు డీసిల్టింగ్ చేయలేక పోవడం వల్ల చిన్న వర్షాలకే ఇళ్లలోకి వరద నీరు వస్తుంది.
– రామయ్య, అన్నపూర్ణనగర్

తగిన చర్యలు తీసుకుంటాం : డీసీ

నామమాత్రపు పనులతో ఇబ్బంది..

ఉప్పల్ ఆదర్శనగర్ అపురూపా జగపతి హైట్స్ ప్రధాన ద్వారం రోడ్డుపై రోజూ వేలాది మంది ప్రయాణిస్తుంటారు. ఈ రోడ్డులో మురుగు నిత్యం వరదలా పారుతుంది. స్కూల్ విద్యార్థులతో సహా ప్రజలంతా ఇబ్బందులు పడుతున్నారు. ఫిర్యాదు చేసినప్పుడు నామమాత్రంగా పనులు చేపట్టకుండా శాశ్వతంగా పరిష్కరించాలి.
– సాకమూరి హరీష్, ఉప్పల్ అపురూప జగపతి హైట్స్

లైన్ మార్చేందుకు తగిన చర్యలు తీసుకుంటాం: డీసీ

మురుగు నీరు జలమండలి పరిధిలో ఉంది. అధికారులకు సమాచారం ఇస్తాం. ఇంజినీరింగ్‌కు సంబంధించి మురుగు పైపులైన్ మార్చడానికి అధికారులతో చర్చించి లైన్ మార్చడానికి చర్యలు తీసుకుంటాం.

రోడ్డుపైకి ర్యాంప్ వేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం..

రామంతాపూర్ డీ మార్టు వద్ద రోడ్డుపైకి ర్యాంప్ వేయడం వల్ల నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది.
– స్థానికుడు

టౌన్ ప్లానింగ్ అధికారులను పంపించి తగిన చర్యలు తీసుకుంటాం : డీసీ

ఫిర్యాదులు పట్టించుకోవడం లేదు..

ధర్మపురి, శ్రీనగర్‌కాలనీ, మూడు రోడ్ల వద్ద రోడ్డు మంజూరైనా ఇంకా రోడ్డు వేయడం లేదు. చెట్ల కొమ్మలు తొలగించి రోడ్లపైనే వేయడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అన్నపూర్ణ కాలనీ బస్‌స్టాప్ వద్ద రోడ్డుపైనే షెడ్డు వేశారు. ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు.
–రాముయాదవ్, ఉప్పల్

రోడ్డుపై వేసిన షెడ్డును పాక్షికంగా తొలగించాం. పూర్తిగా తొలగించిన అనంతరం గ్రీన్ వేస్ట్‌పై తగిన చర్యలు తీసుకుంటాం: డీసీ

కబ్జా చేసి నిర్మాణాలు..
మా స్థలంలో కొంతభాగం కబ్జాచేసి పక్కింటి వారు నిర్మాణం చేపడుతున్నారు. టౌన్‌ప్లానింగ్ సిబ్బందికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు.
– శివ, ఓల్డ్ రామంతాపూర్, శ్రీనగర్‌కాలనీ

టౌన్‌ప్లానింగ్ ఏసీపీ దృష్టికి తీసుకొచ్చి చర్యలు తీసుకుంటాం : డీసీ

నాలాల్లో పూడిక తీయలేదు..
వర్షం వచ్చినప్పుడల్లా ఇళ్లలోకి వరదనీరు వస్తుంది. నాలాల్లో పూడిక తీయలేదు. నాలాను విస్తరించి సమస్యను పరిష్కరించాలి.
– మురళీధర్, రవికుమార్, ప్రవీణ్‌కుమార్ శాంతినగర్, రామంతాపూర్

డీసిల్టింగ్ గురించి ఈఈతో కలిసి చర్చించి సమస్యను పరిష్కరిస్తాం. అవసరమైతే నాలా విస్తరణ పనులు చేపడతాం : డీసీ

రోడ్డు తవ్వారు..

రామంతాపూర్ సెయింట్ జాన్స్ స్కూల్ వద్ద రోడ్డు తవ్వి వదిలేశారు. దీంతో ఇబ్బందులు పడుతున్నాం.
– ఎండీ అబ్దుల్ పాషా, రామంతాపూర్

ఇంజినీరింగ్ విభాగం అధికారులతో కలిసి పరిశీలించి రోడ్డు వేస్తాం : డీసీ

రోడ్డు మీదకు బాల్కానీ..

ఉప్పల్ హనుమసాయినగర్‌లో ఓ వ్యక్తి ఇంటి బాల్కానీనీ రోడ్డు మీదకు వేశాడు. ఫిర్యాదు చేస్తే పాక్షికంగా తొలగించారు. దీనివల్ల స్థానికులకు ఇబ్బందులు ఎదురౌతున్నాయి.
– శ్రీనివాస్‌రెడ్డి, హనుమసాయినగర్, ఉప్పల్

పూర్తిగా తొలగించడానికి ఆదేశాలు జారీ చేస్తాం : డీసీ

అక్రమ నిర్మాణాలు పెరుగుతున్నాయి.

రామంతాపూర్ కేసీఆర్, కేటీఆర్ నగర్‌లలో ఇంటి నిర్మాణానికి అనుమతులు ఇవ్వడం లేదు. దీంతో అక్రమ నిర్మాణాలు పెరుగుతున్నాయి.
– నగేష్, రామంతాపూర్

ఈ అంశం ప్రభుత్వం దృష్టిలో ఉంది. లీగల్ ఒపీనియన్ తీసుకున్న తర్వాతే అనుమతులు ఇస్తాం : డీసీ

ఎమ్మెల్యే పర్యటన



అధికారులతో ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ సునీత

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ పరిధిలోని న్యూవేంకటేశ్వరనగర్, ఇందిరానెహ్రూనగర్, గోపాల్‌నగర్, మల్లికార్జుననగర్ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాను మెరుగుపర్చాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన స్థానిక కార్పొరేటర్ మేకల సునీతారాముయాదవ్‌తో కలిసి మారేడ్‌పల్లి జలమండలి కార్యాలయాన్ని సందర్శించారు. జలమండలి డీజీఎం కృష్ణ, మేనేజర్ స్రవంతిలతో కలిసి మాట్లాడారు. తాగునీరు సక్రమంగా సరఫరా కావడంలేదని, ఆయా కాలనీవాసులు తన దృష్టికి తీసుకొచ్చినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజలకు సరిపడ నీటిని సరఫరా చేయాలని జలమండలి అధికారులకు సూచించారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను విడుదల చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

కుషాయిగూడ: దేశంలో విద్యారంగం, పరీక్ష పత్రాల లీకేజీలపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ.. విద్యార్థి, యువజన సంఘాల ఐక్యకార్యచరణ కమిటీ ఆధ్వర్యంలో తలపెట్టిన దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి సత్యప్రసాద్, ఏఐఎస్ఎఫ్ నేత మహేష్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బంద్ వాల్‌పోస్టర్‌ను బుధవారం ఈసీఐఎల్‌లో విడుదల చేశారు. వారు మాట్లాడుతూ.. 24 లక్షల మంది హాజరైన నీట్ పరీక్ష ప్రశ్నపత్రం లీకేజీకి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కమిటీ ప్రతినిధులు గిరిబాబు, శేఖర్, అరుణ్, కిరణ్, రవి తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



కుషాయిగూడ: గుర్తు తెలియని మృతదేహాన్ని బుధవారం కుషాయిగూడ పోలీసులు గుర్తించారు. టీఎస్ఐఐసీ కాలనీ వసుంధర కళాశాల సమీపంలో సుమారు 40–45 ఏళ్లున్న వ్యక్తి విగతజీవిగా పడి ఉన్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలించగా అప్పటికే అతడు మృతి చెందాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో కేసు నమోదు చేశామని ఎస్సై ప్రసాద్ తెలిపారు. మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించి భద్రపరిచామన్నారు. మృతుడి వివరాలు తెలిస్తే కుషాయిగూడ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

అక్రమనిర్మాణాలపై ప్రత్యేక సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ త్రిలేశ్వర్‌రావు

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అనుమతులేని అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకునేందుకు మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వర్‌రావు ఆధ్వర్యంలో టీఎస్ బీపాస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ స్క్వాడ్‌తో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగర పరిధిలో ప్రభుత్వ, చెరువుశిఖం భూముల కబ్జాలను అరికట్టేందుకు, అక్రమనిర్మాణాలపై చర్యలు తీసుకునేందుకు మున్సిపల్ రెవెన్యూ, అగ్నిమాపక, పోలీస్‌శాఖలతో స్క్వాడ్‌తో సమావేశమయ్యారు. భూకబ్జాలపై వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ స్క్వాడ్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



కార్పొరేటర్‌తో జవహర్‌నగర్ కాలనీ ప్రతినిధులు

మల్కాజిగిరి: జవహర్‌నగర్ కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ అన్నారు. కాలనీ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని మర్యాద పూర్వకంగా కార్పొరేటర్ కలిశారు. కాలనీలోని పలు సమస్యలను అసోసియేషన్ ద్వారా గుర్తించి తన దృష్టికి తీసుకుని రావాలని వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానన్నారు. నారాయణ, జాన్, ఉపాధ్యక్షుడు కాశిరెడ్డి, కోశాధికారి ముత్యంరెడ్డి, సభ్యులు పద్మావతి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రసాద్, ఉమేష్‌సింగ్, జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత

అల్వాల్: ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ పరిధిలోని కళ్యాణ్‌నగర్ రెసిడెన్సీ, పీవీఎస్‌కాలనీ, వసంతపురి కాలనీలో మౌలిక వసతులతో పాటు యూజీడీలైన్ సమస్యను పరిష్కరించాలని బీజేపీ నేతలు బుధవారం సైనిక్‌పురి జలమండలి జీఎంకు వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన జీఎం ప్రాజెక్టు కోసం అంచనా ప్రక్రియను ప్రారంభించి ఆమోదం పొందిన తర్వాత టెండర్ ప్రక్రియను ప్రారంభిస్తామన్నారు. బీజేపీ నేతలు నక్క నాగరాజు, విఠోభ, శ్రీనివాస్, శాస్త్రి, కాలనీవాసులు తదితరులున్నారు.

మరమ్మతు పనుల పరిశీలన

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 5వ డివిజన్‌లో పోచమ్మకుంట రోడ్డుకు మరమ్మతు పనులు, పోచమ్మగుడి వద్ద జరుగుతున్న పనులను బుధవారం డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్‌గౌడ్, స్థానిక కార్పొరేటర్ స్వాతికృష్ణాగౌడ్‌తో కలిసి పర్యవేక్షించారు. అనంతరం మాట్లాడుతూ.. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఏఈ, కాలనీల అధ్యక్షులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి తోడ్పాటునందిస్తా !



ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కుషాయిగూడ : కుషాయిగూడ అభివృద్ధికి తన తోడ్పాటును అందిస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు. స్థానిక సమస్యలపై కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డ్రైనేజీ, రోడ్ల నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే అభివృద్ధికి ఎంత చేసినా తక్కువేనని, అన్ని రకాల వసతులు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, శివకుమార్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి చక్రపాణిగౌడ్, పంజాల బాబు, వాసుదేవముదిరాజ్, చిత్తుల కిషోర్, చల్లా వెంకటేష్, వరప్రసాద్, యాదయ్య, దయానంద్, రాజు, కృష్ణకుమార్, నర్సింగ్‌రావు, దినేష్, శ్రీధర్, సుధీర్‌బాబు, కిరణ్, శ్రీనివాస్ తదితరులున్నారు.

అభివృద్ధి పనులకు ప్రజలు సహకరించాలి



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: సమస్య పరిష్కారానికి ప్రజలు కూడా సహకరించాలని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ కోరారు. బుధవారం బాలసరస్వతీనగర్ కాలనీలో శానిటేషన్, ఇంజినీరింగ్, జలమండలి అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా నాలా విస్తరణ పనుల్లో జాప్యం కావడానికి గల కారణాలను డీఈ మహేష్, ఏఈ దీపక్‌లను అడిగి తెలుసుకున్నారు. నాలా మధ్యలో ప్రైవేట్ వ్యక్తుల భూమి ఉందని వారు కార్పొరేటర్‌కు తెలియజేయడంతో వారికి నష్టపరిహారం ఇప్పించి నాలాపనులు పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. నాలాల్లో పూడిక పనులు సరిగ్గా జరగడం లేదని స్థానికులు తెలపడంతో వెంటనే పనులు చేపట్టాలని ఆదేశించారు. కాలనీలో నూతన యూజీడీ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జలమండలి అధికారులకు సూచించారు. అనంతరం బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు పారవేయొద్దని, ఇంటింటికి వచ్చే ఆటో రిక్షాలకు అందజేయాలని చెబుతూ.. అవగాహన ర్యాలీ నిర్వహించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా ఉండేందుకు పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడం కీలకమని ప్రజలు కూడా సహకరించాలన్నారు. వీఐ రమేష్, శానిటరీ సూపర్‌వైజర్ శ్రీనివాస్, సిబ్బంది గిరి, బాలమణి, రాములు కాలనీవాసులు పాల్గొన్నారు.

మురుగు సమస్యను పరిష్కరించాలి



అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ రాజ్యలక్ష్మి

మౌలాలి: వినాయక్‌నగర్ డివిజన్ పరిధిలోని లాల్బానీనగర్ బండ చెరువును బుధవారం నీటి పారుదల శాఖ ఇన్‌చార్జి డీఈ నరేందర్‌తో కలిసి స్థానిక కార్పొరేటర్ రాజ్యలక్ష్మి పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న బండచెరువులోకి మురుగు మళ్లింపు పనులను వెంటనే ప్రారంభించాలని ఆమె అధికారులను ఆదేశించారు. ఏఈ పృథ్వీ, మున్సిపల్ అధికారులు, కాలనీవాసులు ఉమాకాంత్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మెకానిక్ దినోత్సవం



అల్వాల్ మెకానిక్ దినోత్సవంలో పాల్గొన్న కార్పొరేటర్ శాంతి

అల్వాల్: అల్వాల్‌లో ద్విచక్ర వాహనాల మెకానిక్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి హాజరై కేక్‌కట్ చేసి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. మెకానిక్‌లు అందరూ ఐకమత్యంగా ఉండి వారి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్, రాము, శ్రీశైలం, సందీప్, మాధవరెడ్డి, రాంరెడ్డి, రహీం, కరీం, జయానంద్, రాజు, నాయకులు యాదగిరిగౌడ్, రాజు, కన్నా, గిరి, సాజిత్, అరుణ్ తదితరులున్నారు.

అవార్డు ప్రదానం



ఇన్సెంటివ్ బాండ్ అందజేసిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి: కులాంతర వివాహం చేసుకున్న దంపతులను ప్రోత్సహిస్తూ ప్రభుత్వం 'మ్యారేజ్ ఇన్సెంటివ్ క్యాష్' అవార్డును అందజేస్తుంది. మల్కాజిగిరి కృపా కాంప్లెక్స్ ప్రాంతానికి చెందిన రాజేష్, పుష్పలతలకు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి తన క్యాంప్ కార్యాలయంలో రూ.2.5 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్‌ను వారికి అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి త్వరలోనే చెక్కులు అందజేస్తామన్నారు. ఎస్సీ సంక్షేమశాఖ అధికారులు శ్రీకర్‌రెడ్డి, పాండు పాల్గొన్నారు.

లైంగిక దాడి జరిగిందని.. ..

సోషల్ మీడియాలో కలకలం

మేడిపల్లి: పీజీ కళాశాలలో చదువుకుంటున్న ఓ విద్యార్థిని (20)పై సోమవారం రాత్రి లైంగిక దాడికి హాస్టల్ నిర్వాహకుడే యత్నించాడన్న విషయం బుధవారం సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. దీనిపై మేడిపల్లి పోలీసులను వివరణ కోరగా.. సోషల్ మీడియాలో వస్తున్న వార్తకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదు తమకు అందలేదని, సంబంధిత సెక్టార్ పోలీస్ అధికారి ప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు.

విద్యుదాఘాతంతో చెఫ్ మృతి

– మృతుడు నేపాల్ వాసి

ఉప్పల్ : విద్యుదాఘాతంతో చికిత్స పొందుతూ.. నేపాల్‌కు చెందిన ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మూడేళ్ల క్రితం బతుకుదెరువు కోసం నగరానికి వచ్చాడు. కాగా హిక్మత్ తమ్టా (37) వృత్తిరిత్యా ఫాస్ట్ ఫుడ్ మేకర్. ఉప్పల్‌లోని ఏషియన్ థియేటర్ ఎదురుగా ఉన్న వినాయక స్పైసీ హబ్‌లో చెఫ్‌గా పనిచేస్తూ.. అక్కడే నివాసం ఉంటున్నాడు. ఈనెల 1న అర్ధరాత్రి హబ్‌కు సంబంధించిన బ్యానర్ విద్యుత్ స్తంభానికి కట్టేందుకు హిక్మత్ స్తంభం ఎక్కాడు. దీంతో విద్యుత్ షాక్ తగిలి కిందపడ్డాడు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అతడు మంగళవారం మృతి చెందాడు. బోడుప్పల్‌లో నివాసం ఉంటున్న సోదరుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసును దర్యాప్తు చేస్తున్నారు.

అదనపు గదుల పనులకు శంకుస్థాపన



పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: మల్లాపూర్ ప్రాథమిక పాఠశాలకు అదనపు తరగతుల గదుల నిర్మాణానికి రూ.13.5 లక్షలు మంజూరయ్యాయి. తరగతి గదుల పనుల కోసం బుధవారం మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. తరగతుల నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించి నిర్మించాలన్నారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పద్మారావు, జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు యాదగిరిరెడ్డి, స్థానిక నేతలు తీగుళ్ల శ్రీనివాస్‌గౌడ్, పీఆర్, ప్రవీణ్, దయాకర్‌రెడ్డి, భాస్కర్, శ్రీనివాస్, రఘు నాగరాజుగౌడ్ తదితరులున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్లు

అల్వాల్: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్లతో కలిసి బుధవారం మల్కాజిగిరి మండల తహసీల్దార్ సీతారాంను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. మల్కాజిగిరిలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేయాలని, అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు, అగ్నిమాపక కేంద్రాలు ఏర్పాటుచేయాలన్నారు. ముస్లిం శ్మశానవాటికకు స్థలాలు కేటాయించాలని, మల్కాజిగిరి సర్దార్ పటేల్‌నగర్‌లోని 74 మంది భూ నిర్వాసితులకు పునరావసం కల్పించాలన్నారు. మహేంద్రహిల్స్‌లోని సర్వే నెంబర్–844 గల ప్రభుత్వ భూమిని సర్వే చేయించాలని కోరారు. కార్పొరేటర్లు మీనాఉపేందర్‌రెడ్డి, సునీతా రాముయాదవ్, మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్, బీఆర్ఎస్ నేతలు ఉపేందర్‌రెడ్డి, అంజయ్య, హన్మంతరావు, శ్రీనివాస్, నరేష్, సర్వేష్‌యాదవ్, సతీష్, బాలకృష్ణ, ఉపేందర్, గణేష్, ఓమ్‌రాజ్, శివకుమార్, శ్యామ్, నవీన్, సుధీర్, శోభ, ప్రమీల, జయమ్మ, ఉమ, పరిమళ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



హబ్సిగూడలో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న దృశ్యం

హబ్సిగూడ: హబ్సిగూడ డివిజన్ పరిధిలోని లక్ష్మీనగర్‌లో నిర్మించిన అక్రమ నిర్మాణాలను బుధవారం ఉప్పల్ సర్కిల్ డీసీ ఆంజనేయులు, ఏసీపీ వెంకటరమణ ఆధ్వర్యంలో కూల్చివేశారు. ఉప్పల్ జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అధికారులపై మండిపడటంతో వెంటనే స్పందించిన టౌన్‌ప్లానింగ్ అధికారులు బుధవారం పలు అక్రమ నిర్మాణాలను కూల్చివేసి నోటీసులు జారీ చేశారు. ఉప్పల్ సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలను సహించబోమని, వాటిని కూల్చివేస్తామని హెచ్చరించారు. ఉప్పల్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.